# తొలిబలి

అబ్బా!......తలంచుకుంటే గుండెలు పగిలిపోతున్నై. ఆ భయంకర కాళరాత్రిలో, అంధకారబంధురంలో, చీకటి కెరటాల అల్లకల్లోలనిబిడనిర్జనభయదశ్మశానవాటికలో...పూడ్చబడ్డ శవాన్ని పైకితీశారు......నిశ్శబ్దం తాండవిస్తోంది...ఆ దురాగతాన్ని తిలకించిన తీతువు రహస్యాన్ని బయటపెడుతానని మూలుగుతోంది.

కరణంగారే...మెడలో రుద్రాక్షమాలిక గూడావుంది...ఆ శవాన్ని ముట్టుకుని యెడమచేతి బొటనవ్రేలిని పత్రంపై ముద్రవేయించుకున్నారు..

ఎంతద్రోహం...ఆ గ్రామం శిథిలంకావడానికితడే ప్రబలకారకుడు. సాహుకారు ద్రౌర్జన్యానికి అనుకూల వాతావరణాన్ని, సృష్టించి, విరిగిపోని వ్యూహాలను నిర్మించియిచ్చిన కుటిలమేధావి.

కామయ్య పదియెకరాల పొలంతో, పాడిసంపదలతో, పుత్రకళత్రలతో బాగానే బ్రతికాడు. కాలచక్రగమనవేగంలో పక్షవాత శాపంతో మృత్యుముఖంలో కన్నీటి కెరటాల్ని చిలికించి జీవితాన్ని చాలించాడు. పచ్చగా నిత్యకల్యాణంతో చాలినంత సంపదతో హాయిగా కాలాన్ని నెట్టుకొంటున్న కామయ్య కుటుంబాన్నిచూచి సాహుకారు ఓర్వలేకపోయాడు. ప్రబల ప్రయత్నాలతో కుతంత్ర సాధనలతో కపట విశ్వాసాలతో లొంగని కామయ్యకోసం కాచుక్కూచున్న సాహుకారుకావాడే అపూర్వ తరుణం లభించింది..

కామయ్య సంపదను హస్తగతం చేసుకోడానికే కరణంగారితో ఆలోచించి తీర్మానించుకున్న కార్యక్రమానికి తొలిచర్య శ్మశానంలో జరిగింది. కామయ్య యావదాస్తిని సాహుకారుకు విక్రయం చేసినట్టు వ్రాసిన పత్రంలోనే కామయ్యశవాన్ని పైకితీసి యెడమచేతి బొటనవ్రేలి ముద్రను వేయించుకున్నారు.

కామయ్య కుటుంబంలో విషాదం మకాంవేసింది. కన్నీటి స్రవంతులు సాగినై. వేడి నిట్టూర్పుల పిండులు వెలువడినై...శాస్త్రరీత్యా ఉత్తరక్రియలు జరగడం, కామయ్య గృహిణి మంగళాన్ని చెరిపివేయడం నిరాటంకంగా సాగిపోయినై..

హటాత్తుగా గ్రామంలో పెద్ద కలవరం బయలుదేరింది. పోలీసులు...సర్కారుమనుష్యులు కామయ్య కుటుంబాన్ని ఇల్లు ఖాళీచేయమంటున్నారనే వార్త విద్యుల్లతలా వ్యాపించింది.

సాహుకారు భవనంలో కోలాహలం, అట్టహాసం, కామయ్య గృహంలో ఆందోళన, ఒక్కపెట్టున విజృంభించినవి...

సాహుకారుభవనంలో వేడివేడి పులావులు, కాఫీలు, ఫలహారాలు, ఉపాహారాలు జోరుగా సాగిపోగా కామయ్య గృహంలో ఆకలి; ఆవేదన, దాహం, నిరాశ, నిస్పృహలు విపరీతమైనై...

సాయంకాలం ఆరుగంటలకల్లా సాహుకారు యింటిముందు నిలిచియుండిన మోటారుకారు వెళ్లిపోయింది...గ్రామవాసుల్లో గుసగుసలుమాత్రం యథేచ్ఛగా సాగిపోతూన్నై...

రాత్రి ఎనిమిదిగంటకు దేవుడిగుడివద్ద పంచాయతీ జరిగింది....దేవునియెదుట కామయ్య మూడువేలరూపాయలు తీసుకున్నది పరమ సత్యమని సాహుకారు చెప్పాడు..

కామయ్యభార్య కాంతమ్మ నాకేపాపంతెలియదని చెప్పుకుంది..సాహుకారు పంటపండింది. కాంతమ్మ కాపురముండడానికి యిల్లునుమాత్రం విడచిపెట్టి మిగిలిన పొలాలను సాహుకారు, స్వాధీనం చేసుకోడం న్యాయమని తీర్మానించబడింది...

కాంతమ్మ గుండెల్లో ఆరిపోని అగ్నిశిఖలు అంకురించి ఆమె శరీరమంతా జ్వాలామాలికల తోరణాలతో నిండిపోయింది. వేడికన్నీటి తరగల్లో పూర్తిగా స్నానంచేసింది...

సత్యం అపజయం తోకముడుచుకుంది. గుడిలోని దేవునిలో చలనంలేదు. కాంతమ్మ కన్నీటిని తిలకించిన చంద్రుడు నవ్వుతూనే వున్నాడు. చుక్కలు వెలుగుతూనే వున్నై.

సాహుకారు దౌర్జన్యపద ఘట్టనంలో కాంతమ్మజీవితం నవసిపోవడానికి నాందీప్రస్తావన జరిగింది.

కాంతమ్మచేతిలో కూలికొడవలి తాండవంచేసింది. నిప్పులుకురిసే యెండలో శరీరం చిట్లిపోతున్నా పనిచేయడానికి ఆరంభించింది.

కామయ్య పొలాలను సాహుకారు సాగుచేస్తున్నాడు. అదేపొలంలో వేలడబ్బుల్ని గడించాడు.

ఓనాడు సాహుకారు కాంతమ్మను కూలికిపిలిచాడు. కడుపు కక్కుర్తికోసం వెళ్లింది. కామయ్య స్వంతపొలంలోనే కాంతమ్మ కూలిదైంది...ఆదినమంతా ఆమెహృదయం కుమిలిపోయింది. ఆమెముఖంలో వున్న విషాదాన్ని గుర్తించిన కూలిపడుచు ఓదార్చింది.

సాయంకాలం యింటికివెళ్లి పడుకుంది కానీ ఆమె మనోలోకంలో ఆవేదనాతరంగాల కల్లోలం రేకెత్తింది...కలతనిద్దరలో చిన్నపాపల్ని కౌగలించుకుని పడుకుంది...

ఇంతలో సాహుకారు రమ్మంటున్నాడనే పిలుపు వినబడింది...సంశయహృదయంతోనే వెళ్లింది..

సాహుకారు వసారాలో చుట్టకాల్చుకుంటున్నాడు.

"కాం తా"

"....."

"విన బ డ్డం లే దూ"

"ఏమండీ?"

"రేపు యిల్లు కాళీ చెయ్యాలి"

ఆమె నిలువునా కూలిపోయింది. కాళ్లు చేతులు వణికిపోతున్నై...

"ఏం చెబుతావ్?"

"నే నెక్కడికెళ్లడం?"

"నత్రంలోకి"

"మీకీన్యాయం సరిపోతుందా?"

"ఛీ.. గాడిదా.. వాగుతున్నావ్.. యిప్పుడే కాళీచేయాలి."

కాంతమ్మ కిక్కురమనకుండా తిరుక్కుంది.

ఉదయం సాహుకారుబంట్లు కాంతమ్మను బిడ్డల్ని యీవలకీడ్చి యింటికి తాళంవేశారు.

గత్యంతరంలేక ఆ అభాగిని ఆ దగ్గిరపట్టణానికెళ్లి చిన్న అంగడిపెట్టుకుంది. ఈనాడామె ముసలిది. కొడుకులిద్దరిలో ఒకడు మిలిటరీలో చేరిపోయాడు. ఇంకొకడు మిల్లులో పనిచేస్తున్నాడు..

ఆ సాహుకారు భవనానికిప్రక్క శిథిలమై మొండిగోడలతో ఈనాడు కామయ్య గృహం కళావిహీనంగావుంది.. ఆవీధిలోకనబడే శిథిలగృహాలన్నీ సాహుకారు దుండగాలకు కూలిపోయినవే.. కామయ్య కుటుంబం.. సంపద.. సాహుకారు దురాగతానికి, నిరంకుశానికి యిద్దరు పసినిసుగులను పెంచడానికి తొలిబలి గావింపబడింది.

కే. సభా